క్లుప్తంగా

తగ్గిన వేరుశనగ సాగు విస్తీర్ణం



కల్లూరు వద్ద సాగులో ఉన్న వేరుశనగ పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఖరీఫ్‌లో వర్షాధార పంటగా సాగయ్యే వేరుశనగ పంట ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. సాధారణంగా ప్రతి ఏటా 750 ఎకరాల్లో వేరుశనగ విత్తనాలు వేస్తారు. ఈ సారి సరైన సమయానికి వర్షం కురవకపోవడం, అదును దాటిపోవడంతో ఎక్కువ మంది రైతులు వేరుశనగ విత్తలేకపోయారు. ముందుగా పొలాలను దుక్కిదున్ని సిద్ధం చేసుకున్న రైతులు 65 హెక్టార్లలోనే విత్తనాలు వేసినట్టు ఏవో లీలాకుమారి తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది మండలానికి 750 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు సరఫరా చేసిందన్నారు. అదునుకు వర్షాలు పడకపోవడంతో ప్రతి ఏటా వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గుతోందని వెల్లడించారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు భూమి పూజ

కుప్పం: పట్టణంలోని శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు సోమవారం కడా పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ శ్మశానవాటిక ప్రాంగణంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ చివరి లోపు పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

గ్రామ కమిటీలు కీలకంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: వైఎస్సార్ సీపీ బలోపేతం కోసం గ్రామ కమిటీలు కీలకంగా పని చేయాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మోటుమల్లెల నగిరిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ విషయాన్ని బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. తద్వారా ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీసేలా చైతన్యం కలిగించాలని సూచించారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పెద్ద పీట వేస్తామని తెలిపారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, చెంచురెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, విజయశేఖర్, శ్రీనాథనాయుడు, కరీముల్లా పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ దక్షిణామూర్తి మృతి



పుంగనూరు: పెద్దపంజాణి మండలం మాదనపల్లె, కరసనపల్లె పంచాయతీల మాజీ సర్పంచ్ పిడతల దక్షిణామూర్తి (89) సోమవారం మృతి చెందారు. ఆయన 25 ఏళ్లు ఈ రెండు పంచాయతీల్లో సర్పంచుగా పనిచేశారు. అనేక ఏళ్లు కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. మాదనపల్లెలో షిరిడీ సాయి బాబా ఆలయం, కల్యాణ మండపాలు నిర్మించారు. మదనపల్లె నుంచి పుంగనూరు వరకు పుంగమ్మ చెరువు కట్టపై రోడ్డును వెడల్పు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిని కలిసి పలుమార్లు విన్నవించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమైనప్పటికీ తర్వాత ఆగిపోయాయి. ఆయన మృతిపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, అనూషారెడ్డి, తదితరులు సంతాపం తెలిపారు.

కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

తక్కువ కెపాసిటీ కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు వుండడం, పంటలకు నీటిని పెట్టడానికి విద్యుత్ వినియోగం ఎక్కువ కావడంతో ఓవర్ లోడ్ పడుతోంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్లు, మోటార్లు కాలిపోతున్నాయి. వాటి స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేయకపోవడం, కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదు. పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాలిపోయిన మోటార్ ముందు రైతు(ఫైల్)

ఓవర్ లోడ్ వల్ల కాలిపోయిన స్టార్టర్‌ను రిపేరు చేసుకుంటున్న రైతులు



- వరి పంట వల్ల పెరిగిన విద్యుత్ వినియోగం
- ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్ లోడ్
- దెబ్బతింటున్న స్టార్టర్లు, మోటార్లు
- ఆలస్యమవుతున్న రీప్లేస్‌మెంట్

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలు వున్నాయి. వీటిలో 20 వేల వరకు విద్యుత్ సర్వీసులు వున్నాయి. 18 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు వున్నాయి. ప్రస్తుతం డివిజన్‌లో వేరుశనగ పంట సాగుకు అనుకూలమైన సమయం దాటిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగుపై దృష్టి సారించారు. బోరు బావులు వున్న రైతులు వరి పంట సాగుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పొలాన్ని నీటితో తడపడడానికి విద్యుత్‌ను ఎక్కువగా వినియోగించాల్సి వస్తోంది. పెద్ద సంఖ్యలో మోటార్లు పనిచేస్తుండడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పెరుగుతోంది. తద్వారా అవి కాలిపోతున్నాయి. అంతేగాక విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు కూడా దెబ్బతింటుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ తక్కువ, భారం ఎక్కువ

గతంలో ఒక్కో 15 హెపీ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఇద్దరు రైతులకు చెందిన రెండు 7.5 హెచ్‌పీ మోటార్లు నడిచేవి. భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు 15 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్లను 25 హెచ్‌పీగా అప్‌గ్రేడ్ చేయించుకున్నారు. మోటార్లు, స్టార్టర్ల సామర్థ్యాన్ని సైతం పెంచుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి వేరుగా వుంది. ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతులందరూ పెంచిన కెపాసిటీతోనే విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఈ కారణంగా భారీగా ఓవర్‌లోడ్ పడుతోంది. దీంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ కావడంతో పాటు మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నాయి.

ఆలస్యమవుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల రీప్లేస్‌మెంట్

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాన్స్‌కో పలమనేరులోని ఎస్‌పీఎం సెంటర్‌కు తరలించి మరమ్మతులు చేయిస్తారు. అక్కడ సిబ్బంది తక్కువ మంది ఉండడం, పెద్ద సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండడంతో వాటిని సరిచేయడానికి ఆలస్యమవుతోంది. గతంలో రెండు, మూడు రోజులకు ఇచ్చేవారు. ఇప్పుడు 15 రోజులైనా ఇవ్వడం లేదు. అంతేగాక ట్రాన్స్‌కో సిబ్బందికి నిర్ణయించిన మేర మామూళ్లు ఇస్తేనే వాటికి మరమ్మతులు చేసే పరిస్థితి లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కెపాసిటర్లే ప్రత్యామ్నాయం

పలమనేరు డివిజన్‌లో ఎక్కువగా హైవీడీఎస్ (హై ఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించారు. ఓవర్ లోడ్ కారణంగానే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నట్లు తేల్చారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా కెపాసిటర్లను అమర్చుకోవాలని సూచించారు. 7.5 హెచ్‌పీ మోటార్‌కు 3–కేవీఆర్ సామర్థ్యం కలిగిన ఐఎస్‌ఐ మార్కు కెపాసిటర్‌ను ఏర్పాటుచేసుకోవాలని పేర్కొన్నారు. తద్వారా విద్యుత్ వినియోగం తగ్గి ట్రాన్స్‌ఫార్మర్, మోటార్లు, స్టార్టర్లకు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

మా గ్రామంలోనే నాలుగు మోటార్లు కాలిపోయాయి



మా గ్రామంలోనే పంచాయతీకి చెందిన రెండు బోరు మోటార్లు, రైతులకు చెందిన మరో రెండు బోరు మోటార్లు కాలిపోయాయి. విద్యుత్ తీగలు చెట్లకు తగలడం వల్లే ఇలా జరిగినట్టు తెలిసింది. అంతేగాక టెయిలెండ్‌లో లోవోల్టేజీ సమస్య ఎక్కువగా ఉంది. ఫలితంగా మోటార్లు కాలిపోతున్నాయి. దీనిపై స్థానిక ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– మునస్వామి, సర్పంచ్, టీ.వడ్డూరు

గంగవరం వైఎస్సార్ సీపీ నూతన కమిటీ

గంగవరం: గంగవరం పంచాయతీ వైఎస్సార్ సీపీ నూతన కార్యవర్గాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ పార్టీ కన్వీనర్‌గా ఇదే గ్రామానికి చెందిన ఆనంద, వివిధ గ్రామాల నుంచి దాదాపు 15 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతంతో పాటు వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలుపు కోసం నిర్విరామంగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఇప్పటికే మండలంలోని అన్ని పంచాయతీల్లో నూతన కార్యవర్గ కమిటీలు ఎంపికయ్యాయి.

సచివాలయం ఎదుట ముళ్ల పొదల తొలగింపు



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లె: మండల కేంద్రమైన చౌడేపల్లెలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వున్న సచివాలయం–2 ఎదుట సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. లోపించిన పారిశుద్ధ్యం అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ ఈవో జాకీర్ పారిశుద్ధ్య కార్మికులతో కార్యాలయం ఎదుట పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు.

పెద్దిరెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు





పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు, సదుం: ఎమ్మెల్యే పెద్దిరెడ్డితో నాయకులు

పలమనేరు: మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం తిరుపతిలో పలమనేరుకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, పలమనేరు పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర నేత నాగరాజు, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, మంజునాథ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ నేపథ్యంలో అండగా నిలుస్తామని తెలిపారు. పలమనేరు మండలానికి చెందిన మునస్వామి, గంగవరానికి చెందిన శ్రీరాములురెడ్డి తదితరులు కూడా పెద్దిరెడ్డిని కలిశారు.

పెద్దిరెడ్డిని కలిసిన జెడ్పీటీసీ

సదుం: మాజీ మంత్రి పెద్దిరెడ్డిని సోమవారం తిరుపతిలో జెడ్పీటీసీ సోమశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సదుం మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. పులిచర్ల ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి, పాలమంద సర్పంచ్ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

వి.కోట: వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్, ఎంపీపీ యువరాజ్ తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని గోనుమాకులపల్లి, తోటకనుమ, ఓగు, నెర్నిపల్లి, బోడిగుట్లపల్లి, యాలకల్లు, కుంభార్లపల్లి, బోయచిన్నాగనపల్లి పంచాయతీల్లో పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఇది పదవిగా కాకుండా బాధ్యతగా భావించి పార్టీ బలోపేతానికి కృషిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, యువత అధ్యక్షుడు పవన్‌కుమార్, మహిళ అధ్యక్షురాలు శశికళ కుమార్‌రాజా, రైతు విభాగం అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, జిల్లా బూత్ కమిటీ సెక్రటరీ మణి, ఎస్సీ సెల్ శివరాం, సోషల్ మీడియా శివ, స్టూడెంట్ విభాగం శ్యామ్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటవేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

గుడుపల్లె: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాట వేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆడిటోరియంలో వారం రోజులుగా చిత్తూరు జిల్లాలోని కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ఆయన సోమవారం శిక్షణలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలన్నారు. పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థానాలు చేరుకునేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వెంకటరమణ, అగస్త్య ఫౌండేషన్ చైర్మన్ రాంజీరాఘవన్, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, టి.బాబునాయుడు, ఎంఈవో శ్రీదేవి పాల్గొన్నారు.

బొలేరో వాహనం ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన వారు

పలమనేరు: పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద చైన్నై–బెంగళూరు హైవేలో సోమవారం బైక్‌ను బొలేరో వాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని దుగ్గినవారిపల్లికి చెందిన పెద్ద రెడ్డెప్ప తన భార్య, కుమార్తెతో కలిసి బైక్‌లో పలమనేరు బయలుదేరాడు. నాగమంగళం వద్ద బొలేరో వాహనం ఢీకొంది. బైక్ పది మీటర్ల దూరం ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో పెద్దరెడ్డెప్ప(50) ఆయన భార్య నీలమ్మ(45), కుమార్తె లలిత(22) తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వారిని చిత్తూరుకు రెఫర్ చేశారు. పలమనేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సంఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. అతను మద్యం మత్తులో వున్నట్టు స్థానికులు తెలిపారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

బైరెడ్డిపల్లె: మండలంలో యూరియా కొరత నెలకొనడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బైరెడ్డిపల్లెకు చెందిన ఒక ఎరువుల దుకాణ యజమాని సోమవారం యూరియా లోడు తెప్పించారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని బారులు తీరారు. వారు మాట్లాడుతూ పంటలు సాగు చేయాలంటే ఎరువుల కొరత వుందని, అనేక కష్టాలకు ఓర్చి పంటలు పండించినా గిట్టుబాటు ధర అందక నష్టపోవాల్సి వస్తోందని వాపోయారు. ప్రభుత్వం చొరవ చూపి రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఎరువుల కొరత ఉండేది కాదని, ప్రస్తుతం ఎరువుల కొరత తీవ్రంగా నెలకొందని చెబుతున్నారు.

ట్రైనీ ఎస్‌ఐగా అశోక్‌కుమార్



బంగారుపాళెం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్‌ఐగా అశోక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లాకు చెందిన అశోక్‌కుమార్ 2024–25 బ్యాచ్‌లో 5 నెలలు శిక్షణ పొందనున్నా రు. కొత్తగా వచ్చిన ట్రైనీ ఎస్‌ఐ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణ, ప్రజలతో వ్యవహరించే తీరు, కేసుల నమోదు, దర్యాప్తు తదితర అంశాలపై శిక్షణ పొందేందుకు బంగారుపాళెం పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ఎంపీ, జెడ్పీ నిధులతో తాగునీటి సమస్యకు పరిష్కారం

సదుం: ఎంపీ, జెడ్పీ నిధులతో గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మాధవి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ సజ్జలవారిపల్లె, కశిరెడ్డిగారిపల్లె, మర్రిమాకులపల్లెలో తాగునీటి సమస్య తీవ్రంగా వుందని తెలిపారు. నూతన బోర్లు మంజూరు చేయాలని కోరారు. ఎంపీటీసీ మల్లికార్జున మాట్లాడుతూ కొత్త వడ్డిపల్లెలో బోరుకు పంపుసెట్ ఏర్పాటుచేయాల్సి వుందన్నారు. పంటల సాగుకు యూరియా కొరత లేకుండా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఏవో జ్యోత్స్నను కోరారు. అలాగే జనుము, జీలుగ విత్తనాలను తగినంతగా పంపిణీ చేయాలన్నారు. ఎంపీడీవో హరిబాబు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సచివాలయాల్లో సీనియర్ సిటిజన్ కార్డులు అందజేస్తున్నారని, 60 ఏళ్లు నిండిన వారు వాటిని పొందాలని సూచించారు. రెడ్డివారిపల్లె పాఠశాలలో నెలకొన్న టీచర్ సమస్య పరిష్కరించాలని సర్పంచ్ హనుమంతరెడ్డి కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో సరుకులు పంపిణీ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు సీడీపీవో వాణిశ్రీదేవి తెలియజేశారు. సభ్యులు లేవనెత్తిన అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులునాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్వారీ పనులు ఆపాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం గడ్డూరు సమీపంలో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్నారని, పనులు ఆపాలని మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ ప్రసన్న కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ క్వారీ పేలుళ్లతో ఇళ్లు దెబ్బతింటున్నాయని, పంటలు పండడం లేదని వాపోయారు. కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, ఇళ్లు దెబ్బతింటే ఎలా బతకాలని నిలదీశారు. అదేవిధంగా గ్రామ సమీపంలోనే వెళ్తున్న హంద్రీ–నీవా కాలువకు ప్రమాదం పొంచి వుందన్నారు. నిర్వాహకులు అధికారులకు తప్పుడు నివేదికలు అందజేసి అనుమతులు పొందారని ఆరోపించారు. గ్రామానికి ఆనుకునే క్వారీ వుండడంతో పేలుళ్ల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంగా వుందని వాపోయారు. వెంటనే క్వారీ పనులను ఆపాలని కోరారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం



ఓపెన్ స్కూల్ అడ్మిషన్లను ప్రారంభిస్తున్న సీఎంవో మధు

రొంపిచెర్ల: మధ్యలోనే చదువు మానేసిన విద్యార్థుల కోసం సార్వత్రిక విద్యాపీఠం కింద ఓపెన్ స్కూల్ ఎంతో ఉపయోగంగా ఉంటుందని సీఎంవో మధు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలకు ఓపెన్ స్కూల్ మంజూరు చేసిందని తెలిపారు. ఈ క్రమంలో ప్రస్తుతం అడ్మిషన్లు ఇస్తున్నామని వివరించారు. ఇందులో ప్రవేశం పొందిన వారికి ఆదివారం తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ మీడియట్ చదువుకోవచ్చన్నారు. వీరికి ఐదు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయని తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో చదివిన వారు ఉన్నత విద్య అభ్యసించవచ్చని, ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బడి మానేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మీ, రెడ్డిరమేష్, సుజాత, మహ్మదాలీ, సీఆర్‌పీలు అనసూయ, రాజేంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల సాధనే లక్ష్యం



మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: పేద కుటుంబాలను ఉన్నత స్థాయికి చేర్చడమే పీ–4 లక్ష్యమని, ఇందులో బంగారు కుటుంబాలు తయారవుతాయని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పీ–4పై పట్టణానికి చెందిన వ్యాపారులు, మర్చంట్స్ సంఘం నేతలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా బాగున్న వారు బీపీఎల్ కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పేదరికాన్ని రూపుమాపాల్సిన ప్రభుత్వం దీన్ని ఉన్నత వర్గాలకు అప్పగించడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. సమావేశంలో డీఈ సురేష్‌బాబు, మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఏఈ స్నేహప్రియ, టీపీఎస్ ఇందిర, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా వృక్షాల నరికివేత



టి.పుత్తూరు సమీపంలో చింతచెట్టును యంత్రాలతో కోస్తున్న కూలీలు

తవణంపల్లె: మొక్కలు నాటి సంరక్షించండి.. వృక్ష సంపదను పెంపొందించండి.. అని అధికారులు చెబుతూ వుంటారు. మొక్కల దినోత్సవం లేదా ఇంకేదో దినమని నాలుగు మొక్కలు నాటి ఫొటోలకు ఫోజులివ్వడం రివాజు. ఉపాధి హామీ కింద విరివి గా మొక్కలు నాటే కార్యక్రమం కూడా చేపట్టారు. ఇలా నాటిన మొక్కల్లో చాలావరకు వర్షాలకు పెరిగి పెద్దవి అవుతాయన్నది జగమెరిగిన సత్యం. మండలంలో అలా పెరిగిన వృక్షాలను కొందరు వ్యాపారులు కోసి కలపను ట్రాక్టర్లు, లారీల్లో తమిళనాడుకు, కర్ణాటకకు తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అటవీ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ముత్తరపల్లె క్రాస్‌లో ఇటీవల ఆర్‌అండ్‌బీ రోడ్డు సమీపంలోని భారీ చింతచెట్టును నరికి ముక్కలు చేసి తరలించారు. మూడు రోజుల క్రితం టి.పుత్తూరు సమీపంలో రోడ్డు పక్కనున్న అతి పెద్ద చెట్టును నేలమట్టం చేశారు. దీనిపై సంతపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రెడ్డెప్పను వివరణ కోరగా కట్టెల తరలించడం తమ దృష్టికి రాలేదన్నారు. అనుమతి లేకుండా కలప తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన



పుంగనూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ కార్మికులు సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఏఐటియూసీ నాయకుడు వెంకట్రమణారెడ్డి మాట్లాడుతూ గతంలో కార్మికుల సంక్షేమం కోసం 1217 జీవో కింద భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసినట్టు గుర్తు చేశారు. దాన్ని ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. తిరిగి బోర్డును ఏర్పాటుచేయాలని, పెండింగులో ఉన్న 46 వేల క్లెయిములను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా 12 రకాల సౌకర్యాలను అందించాలన్నారు. కొత్త గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పాత కార్డులను రెన్యువల్ చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.6 వేలు చొప్పున పెన్షన్ మంజూరు చేయాలని డిమాండు చేశారు.

సర్పంచులకు అధికారులు సహకరించాలి

- పనులకు వర్క్ ఆర్డర్లు ఇవ్వకపోవడంపై ఆగ్రహం
- సభ్యుల తీర్మానాలను రికార్డు చేయకపోవడం దారుణం
- అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీడీవో భాస్కర్

పలమనేరు: అభివృద్ధి పనుల్లో అధికారులకు సహకరించడం లేదని, ఇలా అయితే పంచాయతీలు ఎలా అభివృద్ధి చెందుతాయని పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఏది చెప్పినా పట్టించుకోకపోవడం దారుణమని వాపోయారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ రోజా అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, పలువురు సర్పంచులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కాని మండల సమావేశాలు ఉపయోగం లేదన్నారు. అధికారులు అధికార పార్టీ నేతలు చెప్పినట్టు వింటున్నారని, ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఏమి విలువ ఉంటుందని ప్రశ్నించారు. ఎస్టీలు ఎక్కువగా ఉన్న జగమర్ల పంచాయతీలో అధికారులు వివక్ష చూపుతూ అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ కింద మంజూరు చేయించుకున్న పనులకు ఎంపీడీవో వర్క్ ఆర్డర్ ఇవ్వడంలేదన్నారు. సభ్యులు చేసే తీర్మానాలను రికార్డు చేయనప్పుడు మండల సమావేశాలు ఎందుకని నిలదీశారు. స్పందించిన ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ సభ్యులు తెలిపిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జెడ్పీటీసీ మల్లిక రంగన్న, వైస్ ఎంపీపీ గజేంద్ర, తహసీల్దార్ ఇన్బరాజన్, పీఏసీఎస్ సభ్యులు వెంకటమునిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.